# భారతదేశ ఆర్థికాభివృద్ధి

## ఆంగ్లేయుల పాలన నాటి భారత ఆర్థిక వ్యవస్థ

**ఐరోపావారి రాకతో ఆధునిక భారతదేశ చరిత్ర ప్రారంభమైంది. సుగంధ ద్రవ్యాల వ్యాపారం కోసం వచ్చిన పోర్చుగల్, హాలెండ్, డెన్మార్క్, ఇంగ్లండ్, ఫ్రాన్స్ లాంటి ఐరోపా దేశాలు భారతదేశంపై ఆధిపత్యం కోసం ప్రయత్నించాయి. అందులో ఇంగ్లండ్ అంతిమ విజయం సాధించి, భారతదేశాన్ని తన వలస రాజ్యంగా మార్చుకుంది. 1757 లో జరిగిన ప్లాసీ యుద్ధం ఆంగ్లేయుల రాజకీయ అధికారానికి పునాది వేస్తే, 1764లో జరిగిన బక్సార్ యుద్ధం వారి ఆర్థిక అధికారానికి మార్గం వేసింది. ఆంగ్లేయులు 1765 నాటి అలహాబాద్ సంధి ద్వారా బిహార్, బెంగాల్, ఒరిస్సాల్లో భూమి శిస్తును వసూలు చేసుకునే దివానీ అధికారాన్ని పొందారు. భారతదేశాన్ని వలస రాజ్యంగా మార్చి, తమకి లబ్ధి కలిగించే వాణిజ్యవాద (మర్కంటైలిజమ్) విధానాలను అనుసరించారు.**

భారతదేశంలో ఆంగ్లేయులు అనుసరించిన ఆర్థిక విధానాలను రమేష్ చంద్రదత్ మూడు ముఖ్యమైన దశలుగా విభజించారు. అవి...

1) వాణిజ్య ప్రధాన దశ (1757 - 1813)

2) స్వేచ్ఛా వ్యాపార దశ (1813-58)

3) పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దశ (1858-1947)

❖ ఈ మూడు దశల్లో ఆంగ్లేయులు భారతదేశ వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలను తమ లాభం కోసం అనేక మార్పులకు గురిచేశారు. స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. వ్యవసాయ వాణిజ్యీకరణ జరిగింది. స్వేచ్ఛా వ్యాపార విధానాలను అమలు చేశారు. గ్రామీణ కుటీర, చేనేత, చిన్నతరహా పరిశ్రమలు, చేతివృత్తులు నాశనమయ్యాయి.

### వ్యవసాయ రంగం

ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా వ్యవసాయ వాణిజ్యీకరణను ప్రోత్సహించారు. ఆంగ్ల వ్యాపారులే ముందుగా పెట్టుబడులు అందించి, రైతులతో నీలిమందు లాంటి వాణిజ్య పంటలను సాగు చేయించారు. వాటిని తక్కువ ధరలకు పొందేందుకు తీన్ కథియా విధానాలను అనుసరించారు. ఆంగ్లేయుల వ్యవసాయ విధానాల కారణంగా 1771 లో ఒక్కో కుటుంబానికి సరాసరి 40 ఎకరాలుగా ఉన్న భూమి 20 వ శతాబ్దం ప్రారంభానికి 7 ఎకరాలకు తగ్గిపోయింది. నిరంతర క్షామాలు, ప్రకృతి వైపరీత్యాలు, నీటిపారుదల సౌకర్యాల కొరత, భూమి శిస్తు విధానాల వల్ల భారత వ్యవసాయ రంగం దెబ్బతింది.

### భూమి శిస్తు విధానాలు

ఆంగ్లేయులు భూమి శిస్తును వసూలు చేయడానికి వేలం పద్ధతి, శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి లేదా జమీందారీ పద్ధతి, రైత్వారీ పద్ధతి, మహల్వారీ పద్ధతి లేదా గ్రామ పద్ధతి అనే పద్ధతులను ప్రవేశపెట్టారు. వారన్ హేస్టింగ్స్ వేలం వేసే పద్ధతిని ప్రవేశపెట్టి, శిస్తు వసూలుకు కలెక్టర్లను, వారికి సహాయంగా భారతీయ దివాన్‌లను నియమించాడు.

❖ 1793 లో కారన్ వాలీస్ వేలం వేసే పద్ధతిని రద్దు చేసి, శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీన్నే జమీందారీ పద్ధతి అంటారు. ఈ పద్ధతిని బిహార్, బెంగాల్, ఒరిస్సా, కోస్తా ఆంధ్రా, బెనారస్‌లలో అమలు చేశారు. ఈ విధానంలో 10 సంవత్సరాల కాలానికి శిస్తును నిర్ణయించేవారు.

❖ 1787 లోనే కారన్ వాలీస్ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌ను పునర్‌వ్యవస్థీకరించి బెంగాల్‌ను 23 ఆర్థిక మండళ్లుగా విభజించాడు. ప్రతి జిల్లాకు కలెక్టర్‌ను అధిపతిగా నియమించాడు.

❖ జమీందారులు రైతుల నుంచి శిస్తు వసూలు చేసి, అందులో 90 శాతాన్ని కంపెనీకి చెల్లిస్తారు. దీన్నే పేష్కష్ అంటారు. కెప్టెన్ రీడ్, థామస్ మన్రో కృషి ఫలితంగా మద్రాస్ ప్రెసిడెన్సీలోని సేలం జిల్లాలో ఉన్న బారామల్ ప్రాంతంలో తొలిసారిగా రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టారు.

❖ 1800 లో థామస్ మన్రో దత్త మండలాల్లో ఈ పద్ధతిని అమలు చేశాడు. ఈ విధానంలో రైతే నేరుగా ప్రభుత్వానికి శిస్తు చెల్లిస్తాడు. అయితే శిస్తును మాత్రం 45 శాతం నుంచి 55 శాతం వరకు వసూలు చేసేవారు. బిషప్ హెబెర్ 'మనం విధించినంత భూమి శిస్తు ఏ స్వదేశీ రాజు కూడా విధించలేదనేది వాస్తవం' అని పేర్కొన్నాడు.



R-14-12-16

❖ జమీందారీ, రైత్వారీ విధానాలు కంపెనీ సంక్షేమానికి తప్ప రైతాంగ సంక్షేమానికి దోహదపడలేదని కార్ల్ మార్క్స్ పేర్కొన్నాడు. లార్డ్ హేస్టింగ్స్ రైత్వారీ విధానాన్ని మద్రాస్, బొంబే ప్రెసిడెన్సీలకు విస్తరింపజేశాడు. 1922 లో హోల్ట్ మెకంజీ నివేదికను అనుసరించి లార్డ్ హేస్టింగ్స్ వాయవ్య భారతదేశంలో మహల్వారీ పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీన్నే గ్రామ పద్ధతి అంటారు. గ్రామ పెద్దల సముదాయమే శిస్తు వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లిస్తుంది. పంజాబ్, ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్, గంగానదీ లోయ ప్రాంతంలో ఈ విధానాన్ని ప్రధానంగా అమలు చేశారు. ఇందులో 2/3 వంతును శిస్తుగా వసూలు చేశారు. విలియం బెంటింక్ కాలంలో ఈ భూమి శిస్తు 66 శాతానికి పెరిగింది.

❖ ఆంధ్రదేశంలోని ఉత్తర సర్కారు ప్రాంతాల్లో జమీందారీ పద్ధతి, రాయలసీమ/ దత్త మండలాల్లో రైత్వారీ పద్ధతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో గ్రామ పద్ధతి అమల్లో ఉండేవి.

## కరవు కాటకాలు

ఆంగ్లేయుల కాలంలో అనేక కరవులు సంభవించాయి. 1660 - 1750 మధ్య భారతదేశంలో 14 పెద్ద కరవులు సంభవించాయి. 1860 లో వాయవ్య భారతదేశంలో, 1866-67 లో ఒరిస్సా కరవు, 1870 లో బిహార్, బెంగాల్, ఒరిస్సా ప్రాంతాల్లో కరవు, 1803 లో దక్కన్ కరవు సంభవించాయి. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో 1943 లో బెంగాల్‌లో తీవ్ర కరవు సంభవించింది. ఈ సమయంలో 15 లక్షల మంది మరణించారని కె.పి. ఛటోపాధ్యాయ పేర్కొన్నారు. బర్మా నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది.

❖ వాతావరణ శాస్త్రవేత్త అయిన జాన్ ఇలియట్ 1898-99 నాటి కరవు గురించి - 'గత 200 సంవత్సరాల కాలంలో ఇలాంటి కరవు సంభవించలేదు' అని వ్యాఖ్యానించాడు. రిచర్డ్ స్ట్రాచీ కమిషన్ సూచనల మేరకు 1883 లో లార్డ్ రిప్పన్ కరవు కోడ్ (Famine code) ను రూపొందించాడు.

❖ 1903 లో బిహార్‌లోని పూసా వద్ద ఇంపీరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ సంస్థను ప్రారంభించారు. 1905 లో అఖిల భారత వ్యవసాయ బోర్డును స్థాపించారు. 1928 నాటి రాయల్ కమిషన్ ఆన్ అగ్రికల్చర్ వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని సూచించింది. 1919 నాటి మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ చట్టం కరవు కాటకాలను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు కొంత నిధిని కేటాయించింది. అఖిల భారత ఆహార సమితిని ఏర్పాటు చేయాలని జాన్ హుడ్‌హెడ్ కమిటీ పేర్కొంది.

❖ కాంప్‌బెల్ క్షామ నివారణ సంఘం - సర్ లార్డ్ లారెన్స్

❖ రిచర్డ్ స్ట్రాచీ క్షామ నివారణ సంఘం - లార్డ్ లిట్టన్

❖ జేమ్స్ లయల్ క్షామ నివారణ సంఘం - రెండో ఎల్గిన్

❖ సర్ ఆంటోని మెక్‌డొనాల్డ్ క్షామ నివారణ సంఘం - లార్డ్ కర్జన్

❖ సర్ జాన్ హుడ్‌హెడ్ క్షామ నివారణ సంఘం - లార్డ్ వేవెల్

## నీటిపారుదల సౌకర్యాల కల్పన

**ఆం**గ్లేయులు వ్యవసాయ రంగ అభివృద్ధికి, నీటిపారుదల సౌకర్యాల కల్పనకు పెద్దగా కృషి చేయలేదు. 1810 లో మొదటి మింటో కాలంలో యమునా నది కాలువల స్థితిగతులను అధ్యయనం చేయడానికి ఒక కమిటీని నియమించారు. 1815 లో లార్డ్ హేస్టింగ్స్ కృషితో లెఫ్టినెంట్ బ్లేక్ పశ్చిమ జమునా కాలువను పునరుద్ధరించి, ఢిల్లీకి నీటి వసతి కల్పించాడు. 1830 లో కల్నల్ రాబర్ట్, కల్నల్ బేర్డ్‌స్మిత్ తూర్పు జమునా కాలువ పునరుద్ధరణ పనులను పూర్తిచేశారు. గంగానది కాలువ పునరుద్ధరణ కోసం లార్డ్ ఆక్లాండ్ కృషి చేయగా, లార్డ్ ఇల్లిన్‌బ్రో ఆ పథకాన్ని రద్దు చేశాడు. 1856 నాటికి కల్నల్ బేర్డ్‌స్మిత్ నీటిపారుదల శాఖ డైరెక్టర్ జనరల్‌గా నియమితుడయ్యాడు. లార్డ్ హార్డింజ్ కాలంలో గంగా కాలువ పథకం పూర్తయ్యింది. పంజాబ్‌లోని బారీ దోబ్ కాలువను లార్డ్ డల్హౌసీ, జాన్ లారెన్స్ పూర్తి చేశారు. సర్ ఆర్థర్ కాటన్ 1847 లో ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై ఆనకట్టను ప్రారంభించి, 1852 నాటికి పూర్తి చేశారు. దీని నిర్మాణానికి 1,50,000 పౌండ్లు ఖర్చు పెట్టారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఆంధ్రుడైన వీణం వీరన్న కాటన్ దొరకు ఎంతో సహాయ పడ్డాడు.

❖ కాటన్ శిష్యుడైన కెప్టెన్ ఓక్ (కెప్టెన్ ఓర్) విజయవాడ వద్ద కృష్ణా నదిపై 1854-55 లో ప్రకాశం బ్యారేజీని పూర్తి చేశాడు. కాటన్ కృషి ఫలితంగానే మధురై జిల్లాలోని పెరియార్ నదిపై ఆనకట్ట పూర్తయ్యింది. ఇలాంటి నీటిపారుదల సౌకర్యాల వల్లే 1877 నాటి డొక్కల కరువును సమర్థంగా ఎదుర్కోగలిగారు. డల్హౌసీ కాలంలో పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ఏర్పడింది. లార్డ్ రిప్పన్ వెయ్యి మైళ్ల పొడవైన కాలువలు తవ్వించి, కొత్తగా పది లక్షల ఎకరాల భూమిని సాగులోకి తెచ్చాడు.

## వాణిజ్యం

ఆంగ్లేయులు భారతదేశంలో అనుసరించిన వాణిజ్య విధానాన్ని మర్కంటైలిజమ్ లేదా వాణిజ్యవాదం అంటారు. వాణిజ్య ప్రధాన దశలో లాభార్జన ధ్యేయంగా ఉన్న ఆంగ్లేయులు తర్వాతి దశలో భారతదేశాన్ని ముడిసరుకులు ఎగుమతి చేసే దేశంగా, తమ వస్తువులను అమ్మే మార్కెట్‌గా మార్చేశారు. పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దశలో సంపద తరలింపు సిద్ధాంతాన్ని అధికం చేశారు. కంపెనీ గుత్తాధికారాన్ని లేజాఫేర్ సిద్ధాంతం ద్వారా, 1813 చార్టర్ చట్టం ద్వారా అంతం చేశారు. కానీ చైనాతో వ్యాపారం, తేయాకు వ్యాపారంలో కంపెనీ గుత్తాధికారం కొనసాగింది.

❖ 1700, 1720 ల్లో ప్రత్యేక చట్టాలు చేసి భారతీయ వస్తువులు తమ దేశంలో ప్రవేశించడాన్ని నిషేధించారు. 1833 చార్టర్ చట్టం ద్వారా చైనాతో వ్యాపారం, తేయాకు వ్యాపారంలో కూడా కంపెనీ గుత్తాధికారం అంతమైంది. 1858 చట్టం ద్వారా భారతదేశంలో కంపెనీ పరిపాలన అంతమై, బ్రిటిష్ సార్వభౌముల ప్రత్యక్ష పాలన ప్రారంభమవడం, ఇంగ్లండ్‌లో వచ్చిన పారిశ్రామిక విప్లవం భారత వాణిజ్యంపై మరింత ప్రభావం చూపాయి.

❖ 1860 లో భారతదేశంలో బడ్జెట్ విధానం, ఆదాయ పన్ను లాంటి ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టారు. 1869 లో సూయజ్ కాలువ తెరవడంతో భారత్-ఇంగ్లండ్ వాణిజ్యం మరింత ప్రభావితమైంది.

❖ 1870 లో ఈ రెండు దేశాల మధ్య టెలిగ్రాఫ్ లైన్ వేశారు. అదే సంవత్సరం లార్డ్ మేయో భారతదేశంలో ఆర్థిక వికేంద్రీకరణను ప్రవేశపెట్టాడు. ఆంగ్లేయుల వాణిజ్య, పారిశ్రామిక విధానాలు భారతదేశ వాణిజ్యాన్ని, పరిశ్రమలను నాశనం చేశాయి. పారిశ్రామిక విప్లవ ఫలితంగా భారతదేశంలో ఏర్పడిన మురికివాడలు, దుర్భర పరిస్థితుల గురించి చార్లెస్ డికెన్స్ తన నవలల్లో వర్ణించారు.

❖ 1813 లో లక్షా పదివేల పౌండ్లుగా ఉన్న బ్రిటన్ నూలు వస్త్రాల దిగుమతి విలువ 1856 నాటికి 63 లక్షల పౌండ్లకు చేరింది.

❖ బ్రిటిష్ వారి ఆర్థిక విధానాల వల్ల 1911-41 మధ్య 30 సంవత్సరాల కాలంలో భారతదేశంలో మనిషికి లభించే ఆహారం 29 శాతం తగ్గిందని విలియం హంటర్, డి.ఆర్. గాడ్గిల్ లాంటి వారు పేర్కొన్నారు.

❖ బ్రిటిష్‌వారి ఆర్థిక విధానం గురించి నాటి మద్రాస్ బోర్డ్ ఆఫ్ రెవెన్యూ అధ్యక్షుడైన సువలివాన్ 'గంగ నది ఒడ్డున ఉన్న సంపదనంతా పీల్చేసి, థేమ్స్ నది ఒడ్డున కక్కే స్పాంజి లాంటిది' అని వ్యాఖ్యానించారు.

❖ 1834 నాటికి భారత ఎగుమతుల విలువ కేవలం 15 కోట్లు కాగా 1934 నాటికి వాటి విలువ 758 కోట్లకు పెరిగింది.

## పరిశ్రమలు

పారిశ్రామిక విప్లవ ఫలితంగా భారతదేశంలోని చేనేత, చిన్నతరహా, కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులు నాశనమయ్యాయి. వస్త్రాల నాణ్యతలో ప్రపంచ వ్యాప్తంగా పేరుపొందిన భారతదేశం క్రమంగా బలహీనపడింది. రైలు మార్గాల నిర్మాణంతో గ్రామీణ చేతివృత్తులు అడుగంటిపోయాయి. మగ్గాలపై 'మోతుర్బా' అనే పన్ను విధించారు. భారతీయ వస్త్రాలు, ఉత్పత్తులపై అధిక పన్నులు విధించడం ద్వారా ఆంగ్లేయులు భారతీయ పరిశ్రమలను, వాణిజ్యాన్ని నాశనం చేశారు.

❖ 'ఇలాంటి దైన్య స్థితికి వాణిజ్య చరిత్రలో ఎక్కడా పోలిక దొరకదు. చేనేత కార్మికుల ఎముకలతో భారత మైదానసీమలు తెల్లబారాయి' అని విలియం బెంటింక్ పేర్కొన్నాడు. అయితే 19 వ శతాబ్దంలో కొన్ని ఆధునిక పరిశ్రమలను స్థాపించారు.

❖ 1845 లోనే భారతదేశంలో బొగ్గు గనుల్లో పని ప్రారంభమైంది. 1853 లో బొంబాయిలో తొలి వస్త్ర పరిశ్రమను కౌస్జీ నానాభాయ్ స్థాపించారు. 1855 లో బెంగాల్‌లోని రిస్రా వద్ద తొలి జనపనార మిల్లు ప్రారంభమైంది. 1879 నాటికి మనదేశంలో సుమారు 56 వస్త్ర మిల్లులు, 1882 నాటికి 20 జనపనార మిల్లులు ఏర్పాటయ్యాయి.

❖ 1907 లో జంషెడ్‌పూర్ కేంద్రంగా ఏర్పడిన టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ (TISCO) భారతదేశంలో తొలి ఇనుము - ఉక్కు కర్మాగారం.

❖ ఆంగ్లేయుల పాలనలో వస్త్రాలు, జనపనార మిల్లులు, టీ తోటల్లో మాత్రమే పారిశ్రామిక ప్రగతి జరిగింది. అయితే వాటి ఫలితాలను కూడా ఆంగ్లేయులే పొందారు.

❖ డి.ఆర్. గాడ్గిల్ బ్రిటిషర్ల పాలనలో భారతీయ పరిశ్రమలు నాశనం కావడానికి మూడు ముఖ్య కారణాలను పేర్కొన్నారు. అవి: 1) స్థానిక పాలకులను ఆంగ్లేయులు ఓడించడం 2) స్థిరమైన విదేశీ పాలనను నెలకొల్పడం 3) ఆంగ్లేయుల పారిశ్రామిక ఉత్పత్తుల పోటీని స్వదేశీ ఉత్పత్తులు తట్టుకోలేకపోవడం.

**- బి. నాగరాజు**